నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 5 ఆగస్టు 2024 | HYDERABAD

ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడుతున్న సాగర తీరం

'శ్రీశైలం' సందర్శనకు వెళ్లి.. మృత్యుఒడిలోకి..

చెట్టును ఢీకొట్టిన కారు.. ముగ్గురు మృతి

మల్కాజిగిరి: శ్రీశైలం జలాశయం సందర్శనకు వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాతపడ్డారు. అమ్రాబాద్ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. శ్రీశైలం జలాశయం నిండుకుండలా ఉండటంతో డ్యామ్‌ను చూసేందుకు అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారానికి చెందిన మాచర్ల కిషన్ కన్నయ్య(22) తన ముగ్గురు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి కారులో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు.. నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం పటవర్లపల్లి వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. కిషన్ కన్నయ్యతో పాటు మరో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. కోంపల్లికి చెందిన సాయిప్రకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. మరణించిన ముగ్గురి మృతదేహాలను పోస్టు మార్టం కోసం అచ్చంపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించిన పోలీసులు.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాచర్ల కిషన్ కన్నయ్య(ఫైల్)

వరద నీరు ఇంకేలా.. భూగర్భ సంపులు

ప్రయోగాత్మకంగా 12 చోట్ల పనులకు జీహెచ్‌ఎంసీ శ్రీకారం

సిటీబ్యూరో, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వరద నీటి నివారణకు సరికొత్త విధానాన్ని జీహెచ్‌ఎంసీ అమలు చేస్తున్నది. దాదాపు 140 చోట్ల వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించిన అధికారులు.. నీరు ఇంకిపోయేలా సంపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 10 నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో 150 అడుగుల ఇంజక్షన్ బోర్‌వెల్స్ వేసి వరదను కట్టడి చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు. సుమారు రూ. 20 కోట్లతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఇందులో భాగంగానే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదుట 10 లక్షల లీటర్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యంతో సంపుల నిర్మాణ పనులను మొదలుపెట్టారు. సచివాలయం ఎదురుగా తెలుగు తల్లి వంతెన పక్కనున్న బస్టాపుల వద్ద భారీగా వర్షపు నీరు నిలుస్తోందని, అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి విస్తీర్ణాన్ని నిర్ధారిస్తున్నామని ఇంజినీరింగ్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఈ స్థలంలో నాలుగు ఇంజక్షన్ బోర్‌వెల్స్ వేశారు. ఒక్కొక్కటి 80 అడుగుల లోతుతో బోర్లు వేసినట్లు అధికారులు చెప్పారు. కాగా, నిర్ణీత స్థాయిలో వర్షపు నీరు వచ్చి చేరగానే సంపులో ఆటోమెటిక్‌గా మోటార్లు ఆన్ అయ్యేలా సెన్సార్లు ఏర్పాటు చేశారు. దీంతో వెంటనే వరద నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. ఈ తరహాలో 12 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సంపుల నిర్మాణాలు చేపడుతున్నారు. మిగిలిన చోట్ల టెండర్ దశలో ఉన్నాయని, త్వరలోనే అన్ని చోట్ల పనులు ప్రారంభించి ఈ వర్షాకాలం ముగింపు నాటికల్లా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

భవిష్యత్ బీఆర్ఎస్‌దే

పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు కార్తికేరెడ్డి, కందుకూరు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ పలు విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపాలన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ చైర్మన్ ర్యాపాకు ప్రభాకర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహా రెడ్డి, మాజీ డైరెక్టర్లు పాట్టి ఆనంద్ తదితరులు ఉన్నారు. - కందుకూరు, ఆగస్టు 4

ఎలివేటెడ్‌కు మరో చిక్కుముడి

కోర్టుకెక్కిన సికింద్రాబాద్ క్లబ్

క్లబ్ ఆస్తులకు నష్టం లేకుండా పనులు జరగాలని న్యాయస్థానం సూచన

సిటీబ్యూరో: ఆదిలోనే హంసపాదు అన్నట్లు.. ఎలివేటెడ్ కారిడార్ విషయంలో మరో చిక్కు ముడి పడింది. ప్రాజెక్టు పనులు మొదలుపెట్టక ముందే సికింద్రాబాద్ క్లబ్ కోర్టు మెట్లను ఎక్కింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కారణంగా తమ ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ రక్షణ శాఖ జాప్యం చేసి.. ఎట్టకేలకు భూములను ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రైవేటు ఆస్తులతో ఇప్పుడు మళ్లీ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నదని హెచ్ఎండీఏ వర్గాలు భావిస్తున్నాయి. అదే కనుక జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చామని చెప్పుకునే ప్రాజెక్టు కూడా న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు.

ప్రాజెక్టు నిర్మాణం వల్ల..

ఎలివేటెడ్ కారిడార్ విషయంలో ఇన్నాళ్లు రక్షణ శాఖ భూములతో వివాదం వేధించింది. సుదీర్ఘ మంతనాల తర్వాత బీఆర్ఎస్ చేసిన ప్రతిపాదనలతో రక్షణ శాఖ భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. తాజాగా జేబీఎస్ బస్టాండ్ సమీపంలో ఉండే సికింద్రాబాద్ క్లబ్ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల క్లబ్‌కు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, విధివిధానాలను పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టేలా హెచ్ఎండీఏను ఆదేశించాలంటూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన ఉన్నత న్యాయస్థానం... ఇష్టానుసారంగా ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లేలా నిర్మాణ పనులు చేపట్టకూడదని హెచ్ఎండీఏ, ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

18 కిలోమీటర్ల మేర..

సీఎం రేవంత్ రెడ్డి 18 కిలోమీటర్ల ప్యాట్నీ–శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన భూముల బదలాయింపు ప్రతిపాదనలకు ఇటీవల రక్షణ శాఖ ఆమోదం తెలపడంతో... ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ సెంటర్ నుంచి మొదలై తూంకుంట మీదుగా శామీర్‌పేట సమీపంలోని ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద ఈ కారిడార్ ముగియనుంది. ఈ మొత్తం కారిడార్ పొడవు 18.10 కిలోమీటర్లు. అండర్ గ్రౌండ్ టన్నెల్ 0.3 కిలోమీటర్లు. మొత్తం 287 పిల్లర్లతో, ఆరు వరుసల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీనిపై రాకపోకలు సాగించేందుకు వీలుగా తిరుమలగిరి జంక్షన్ వద్ద నుంచి అల్వాల్ వరకు మూడు చోట్ల ఇరువైపులా ర్యాంపులను నిర్మించనున్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

కొండాపూర్ ఫ్లైఓవర్ నుంచి పడి ఇద్దరు.. లారీ కిందపడి మరొకరు

కొండాపూర్/మాదాపూర్ ఆగస్టు 4 : నగరంలో ఆదివారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. అతి వేగం..నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన బాల ప్రసన్న (24) బీటెక్ పూర్తి చేసి.. ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. అదే మండలం మర్రిచెట్టుపాలెం గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు రోహిత్ (26) ఐటీ కారిడార్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున వీరిద్దరూ కలిసి బైక్‌పై మజీద్‌బండ వైపు నుంచి హఫీజ్‌పేట్ వైపు వెళ్తున్నారు. బైక్ నడుపుతున్న రోహిత్ మితి మీరిన వేగంతో బొటానికల్ గార్డెన్ సమీపంలోని కొండాపూర్ ఫ్లైఓవర్‌పైకి వెళ్లాడు. వంతెన మలుపులో అదుపుతప్పి రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టాడు. ప్రసన్న, రోహిత్ ఇద్దరు ఫ్లైఓవర్‌పై నుంచి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన వీరిద్దరిని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయారు. గచ్చిబౌలి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

బాల ప్రసన్న (ఫైల్)

రోహిత్ (ఫైల్)

జైస్వామి శంకర్ (ఫైల్)

లారీ కిందపడి..

లారీ కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అమలాపురానికి చెందిన ప్రవీణ్ (25), అరిగాలి జైస్వామి శంకర్ (24) సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ ఐసీఐసీఐ బ్యాంక్ ఇన్సురెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ.. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 6 లో నివాసముంటున్నారు. ఆదివారం తెల్లవారు జామున స్నేహితులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై వీరిద్దరూ నిర్లక్ష్యంగా.. వేగంగా జేఎన్‌టీయూ నుంచి మాదాపూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బండి అదుపుతప్పడంతో ప్రవీణ్ సడెన్ బ్రేక్ వేయగా, వెనకాల కూర్చున్న జైస్వామి శంకర్ ఎగిరి అటుగా వెళ్తున్న లారీ కింద పడి మృతిచెందాడు. ప్రవీణ్ గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో మూడు దశల్లో..

మేడ్చల్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నది. అందులో భాగంగా త్వరలోనే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రణాళికలను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో మూడు దశల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను చేపట్టనున్నారు. క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తర్వాత ఉన్నతాధికారులకు నివేదికలను సమర్పించనున్నారు.

నేటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం

సిటీబ్యూరో, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ కార్యక్రమాలను నిబద్ధతతో చేపట్టాలన్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రధాన భూమిక పోషించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విభాగాల అధికారులు ప్రజలతో మమేకమై కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సూచనలు, భాగస్వామ్యంతో నగరం నిరంతరంగా పరిశుభ్రత, పచ్చదనంతో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

'సీజనల్' నివారణకు వైద్య శిబిరాలు

నేటి నుంచి 15వ తేదీ వరకు

సిటీబ్యూరో, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధుల నివారణకు సోమవారం నుంచి 15 తేదీ వరకు మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. 108 వార్డుల్లోని 495 కాలనీల్లో ఈ శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే జోనల్, డిప్యూటీ కమిషనర్లు షెడ్యూల్ ప్రకారం హెల్త్ క్యాంపు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు.

రాగల రెండ్రోజులు..

జూబ్లీహిల్స్, ఆగస్టు 4 : ఉపరితల ఆవర్తన ప్రభావంతో గ్రేటర్లో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. రాగల రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం మూసాపేట్ సర్కిల్ బాలాజీనగర్ పీహెచ్‌సీ సెంటర్ ప్రాంతంలో 1.63, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఆదర్శనగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంతంలో 1.35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 30.8, కనిష్ఠం 24.4 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 71 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

చిన్నారి సురక్షితం

అపహరణకు గురైన బాలిక ఆచూకీ లభ్యం

'సీసీ' ఆధారంగా కేసును ఛేదించిన అబిడ్స్ పోలీసులు

నిందితుడి అరెస్టు.. భరోసా సెంటర్‌కు చిన్నారి తరలింపు

అబిడ్స్, ఆగస్టు 4: అపహరణకు గురైన చిన్నారిని అబిడ్స్ పోలీసులు రక్షించారు. దుండగుడిని పట్టుకున్న పోలీసులు..వైద్యపరీక్షల కోసం చిన్నారిని భరోసా కేంద్రానికి తరలించారు. ఆదివారం అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. బేగంబజార్ ఛత్రి ప్రాంతానికి చెందిన ప్రియాంక తన సోదరుడి కూతురు (6)ను తీసుకుని శనివారం మధ్యాహ్నం అబిడ్స్ కట్టెలమండిలో పుట్టింటికి వెళ్లింది. అక్కడ స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆడుకుంటున్న చిన్నారి అపహరణకు గురైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అబిడ్స్ పోలీసులు రంగంలోకి దిగి.. ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించగా, చిన్నారి గుర్తుతెలియని వ్యక్తి చెయ్యి పట్టుకొని నడుచుకుంటూ వెళ్లి..ఆటో ఎక్కినట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను విచారించగా, అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో దింపినట్లు చెప్పాడు. అక్కడ సీసీ కెమెరాలను పరిశీలించారు. జహంగీర్ పీర్ దర్గాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో నిందితుడు బాలికతో వెళ్లినట్లు గుర్తించారు. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి.. గాలింపు చర్యలు చేపట్టాయి. ఆదివారం ఉదయం కొత్తూరు మండలం ఇనుముల నర్వ గ్రామ సమీపంలో బాలికను తీసుకొని వెళ్తున్న వ్యక్తిని పోలీసులు గుర్తించి.. అదుపులోకి తీసుకోవడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. నిందితుడు బీహార్‌కు చెందిన మహ్మద్ బిలాల్ అన్సారీ(32)గా గుర్తించారు. బాలికను కిడ్నాప్ చేసి తల్లిదండ్రుల నుంచి డబ్బుల డిమాండ్ చేయాలని పథకం పన్నినట్లు డీసీపీ అక్షాంశ్ యాదవ్ తెలిపారు. సైకిల్ కొనిస్తానని, డాడీ దగ్గరకు తీసుకెళ్తానంటూ.. చిన్నారిని నమ్మించి.. అపహరించినట్లు చెప్పారు. బిలాల్ అన్సారీపై అనేక కేసులున్నాయని, జైలు శిక్ష కూడా అనుభవించాడని వెల్లడించారు. అలాగే హైదరాబాద్‌కు వచ్చిన తరువాత కొత్తూరు పరిధిలోని ఎనిమిదేండ్ల బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన కేసులో బిలాల్ అన్సారీ నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్

₹24,042 కోట్లు..78.4 కి.మీలు

మెట్రో 2.0 కోసం కారిడార్ల వారీగా డీపీఆర్‌లు

'ఎయిర్‌పోర్టు' కారిడార్‌కు రూ.8500 కోట్లు

'పాతబస్తీ'కి రూ.2300 కోట్ల అంచనా

2029 నాటికి పూర్తి చేసేలా డీపీఆర్‌ల రూపకల్పన

-ఆగస్టు 15 నాటికి ప్రభుత్వం ముందుకు

సిటీబ్యూరో: మెట్రో రైలు రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదికల రూపకల్పన కొలిక్కి వచ్చింది. మొదటి దశను అనుసంధానం చేస్తూ రూ.24,042 కోట్ల అంచనాతో 78.4 కి.మీ మేర విస్తరించేలా 5 కారిడార్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థ సిస్ట్రాకు డీపీఆర్ రూపకల్పన బాధ్యతలను ఇవ్వడంతో ఆ సంస్థ ప్రతినిధులు బేగంపేటలోని మెట్రో రైలు భవన్ కేంద్రంగానే పనిచేస్తున్నారు. డీపీఆర్‌కు తుది రూపం ఇస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని వచ్చే నాటికి డీపీఆర్‌ను ప్రభుత్వం ముందుంచాలని హైదరాబాద్ మెట్రో అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో ప్రతిపాదించిన 5మెట్రో కారిడార్లకు వేర్వేరుగా డీపీఆర్‌లను సిద్ధం చేశారు. మొదటి దశలో పెండింగ్‌లో ఉన్న పాతబస్తీ మెట్రో మార్గాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగిస్తూ దానికి ప్రత్యేకంగా డీపీఆర్ సిద్ధం చేయగా, మిగతా 5 కారిడార్లకు డీపీఆర్‌లను ఆగస్టు 15 నాటికి రాష్ట్ర ప్రభుత్వం ముందుంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 5 మెట్రో కారిడార్లకు వేర్వేరుగా డీపీఆర్‌లు సిద్ధం చేసి టెండర్లు పిలిచి వేర్వేరు నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మొత్తం ఒకే సంస్థకు ఇవ్వకుండా 5 కారిడార్లను వేర్వేరు సంస్థలకు ఇవ్వడం ద్వారా ఒకే సమయంలో అన్ని కారిడార్ల పనులు ఆయా నిర్మాణ సంస్థలు చేపట్టేలా చర్యలు తీసుకోనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచే 50% నిధులు..

మొదటి దశ మెట్రోను పూర్తిగా పీపీపీ విధానంలో నిర్మిస్తే, రెండో దశను పూర్తిగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే నిధులను సమకూర్చనున్నాయి. మొత్తం వ్యయంతో కేంద్ర ప్రభుత్వం 15శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం భరిస్తే, మిగతా 50 శాతంలో 45 శాతం రుణాల ద్వారా, మరో 5 శాతం వ్యయాన్ని పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా రెండో దశ మెట్రో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2029 నాటికి రెండో దశను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు డిజైన్‌తో పాటు నిధులను సమకూర్చుకునే ప్రణాళికను డీపీఆర్‌తో పాటు ప్రభుత్వానికి అందజేయనున్నారు. మొత్తం 5 కారిడార్లలో నిర్మించే మెట్రో రెండో దశకు కారిడార్ల వారీగా వ్యయాన్ని అంచనా వేస్తూ డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు సుమారు 31 కి.మీ మెట్రోకు రూ.8500 కోట్ల దాకా వ్యయం అవుతుంది. ఎయిర్‌పోర్టు కారిడార్ నిర్మాణంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సంస్థ సైతం భాగస్వామిగా ఉండనున్నది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాయదుర్గం నుంచి ఓఆర్ఆర్ వెంబడి ప్రతిపాదించిన మెట్రో మార్గంలో నిర్మాణానికి ఆ సంస్థ సుమారు రూ. 625 కోట్ల వరకు వెచ్చించేందుకు ముందుకు వచ్చింది. ఇలా ఒక్కో కారిడార్‌ను వేర్వేరుగా నిర్మించేందుకు వీలుగా డీపీఆర్‌లను రెడీ చేస్తున్నారు.

పాతనగరం మెట్రోకే రూ.2300 కోట్ల అంచనా..

పాతనగరంలో మెట్రో మార్గాన్ని నిర్మించే రోడ్డు విస్తీర్ణం చాలా తక్కువగా ఉంది. ఆ మార్గాన్ని 60 నుంచి 80 అడుగుల మేర విస్తరించాలంటే ఆస్తుల సేకరణ ఎక్కువ మొత్తంలో చేయాలి. ఈ మార్గంలో విద్యుత్ స్తంభాలు, మంచినీటి లైన్లు, డ్రైనేజీ లైన్స్, కేబుల్స్‌ను మరో చోటుకు తరలించాల్సి ఉంటుందని, సుమారు రూ.200 కోట్లు వ్యయం అవుతుందని మెట్రో అధికారి తెలిపారు. మతపరమైన కట్టడాలు సైతం 100కు పైగా ఉండడంతో వీటికి ఎలాంటి ఆటంకం కలుగకుండా నిర్మాణాలు చేపట్టాలంటే.. చాలా సమయం తీసుకుంటుంది. 7.5 కి.మీ మెట్రో కారిడార్‌లో భారీ ఎత్తున ఆస్తులను సేకరించాల్సి వస్తోందని అధికారులు చెప్పారు. ప్రతిపాదిత మెట్రో మార్గంలో సుమారు 1100లకు పైగా ఆస్తులు ఉన్నాయని, వాటన్నింటికీ పరిహారాన్ని చెల్లించాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యయంలో సగం ఆస్తుల సేకరణకే వెచ్చించాల్సి ఉంటుందన్నారు. ఈ లెక్కన పాతనగరం మెట్రోకే రూ.2300 కోట్ల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

ఆదివారం చార్మినార్ వద్ద కావడి యాత్ర శోభాయమానంగా సాగింది